



# స్నేహితుడా!

సి.ఎన్.చంద్రశేఖర్

"మాధవ్ గారూ..."

"..............."

"ఓ వేణు మాధవ్ గారూ...."

తన సీటులో పనిచేసుకుంటున్న మాధవ్ తలెత్తి ఎదురుగా వస్తున్న మాధవిని చూసి "పిలిచారా?" అని అడిగాడు.

"కాదు...అరిచాను. అయినా మీకు వినబల్లేదు" కోపం నటిస్తూ అంది మాధవి.

"అందుకే మిమ్మల్ని భోజనం ప్రతి రోజూ చెయ్యమని చెబుతుంటాను. అరిచానని మీరనుకుంటున్నారు. మీలో మీరే మాట్లాడుకుంటున్నారని నేననుకుంటున్నాను"

"జోక్ బాగుంది కానీ కంగ్రాచ్యులేషన్స్"

"థ్యాంక్స్"

"ఎందుకని అడగరేం?"

''అదే పనిగా సీటు దగ్గరకి వచ్చి అభినందించిన వారు ఎందుకో చెప్పకపోతారా? అని ఊరుకున్నాను.''

''మన బ్రాంచి నుంచి ఆఫీసరు పోస్టుకు ఇంటర్వ్యూ కోసం ఇద్దర్ని సెలక్ట్ చేశారు. అందులో మీరున్నారు''

మాధవ్ ముఖం ఆనందంతో వెలిగింది.

''థాంక్యూ...థ్యాంక్యూ వెరీమచ్. అలాగే మీరు కూడా నా అభినందనలు అందుకోండి''

''అంటే ఈ విషయం మీకు ముందే తెలుసా?'' అనుమానంగా అడిగింది మాధవి.

''మీరు చెప్పాకే నాకు తెలిసింది''

''మరి ఆ రెండోవ్యక్తిని నేనని మీకెలాతెలిసింది?''

''మీరు సెలక్ట్ కాకపోయి వుంటే మీ ముఖం ఇంత ఉత్సాహంగా, ఆనందంగా వుండదు కాబట్టి ఊహించాను.''

''అంటే మీరొక్కరే సెలక్ట్ అయితే నేను బాధపడతాననుకున్నారా?'' నిష్ఠూరంగా అంది.

''నేను సెలక్ట్ అయినందుకు కాదు, మీరు కానందుకు బాధపడేవారు.''

''మీతో మాట్లాడి నేను గెలవలేను కాని నేను సీటుకు వెళుతున్నాను. మీకు ఆల్ ది బెస్ట్''

''థాంక్యూ అండ్ విష్ యు ది సేమ్'' అన్నాడు మాధవ్.

***

ఆ రోజు రాత్రి మాధవికి మాధవ్ పదే పదే గుర్తుకు రాసాగాడు. అతని మాటలు, నవ్వు, హుందాతనం, చిలిపితనం, కళ్లముందు కదలాడసాగింది.

''మాధవ్ మంచివాడు. ఆఫీసులో అందరితో ఆప్యాయంగా మాట్లాడతాడు. ఎలాంటి భేషజాలు లేని మనిషి. ఎవరినీ నొప్పించడు. ఎప్పుడూ హుషారుగా వుంటాడు. అందరికీ తన చేతనయినంత సహాయం చేస్తాడు. అటువంటి వ్యక్తి స్నేహం లభించడం తన అదృష్టం'' అనుకుంది మాధవి.

మరుసటి రోజు లంచ్ టైమ్‌లో మాధవ్ ఎదురు పడినప్పుడు ''బాగా చదువుతున్నారా'' అని అడిగింది.

''ఆ... నవ్య, ఇండియా టు డే..''

''మాధవ్‌గారూ.. ఐ యామ్ సీరియస్'' అంది కోపంగా.

''నో... యూ ఆర్ హెల్దీ''

ఫక్కున నవ్వేసింది మాధవి.

తర్వాత ''మీరు ఇంత బాగా మాట్లాడే విద్యను ఎక్కడ నేర్చుకున్నారు?'' అని అడిగింది.

''శ్రీ చైతన్య టాకింగ్ కోచింగ్ సెంటర్‌లో''

మళ్లీ నవ్వింది మాధవి.

''నేను చెప్పే విషయం శ్రద్ధగా వింటారా?'' సీరియస్‌గా అడిగింది మళ్లీ.

''చెప్పండి'' రెండు చేతులూ కట్టుకుని వినయం నటిస్తూ అన్నాడు.

''మీరు ఇంటర్వ్యూను సీరియస్‌గా తీసుకునే పక్షంలో రోజూ సాయంత్రాలు మనం కలిసి చదువుకుందాము. అలా చదివితే ఒకరికి తెలియనివి ఇంకొకరి నుంచి నేర్చుకోవచ్చు. కలిసి చదివితే బోరు కొట్టదు''

''మంచి ఆలోచన అలాగే చేద్దాం'' అన్నాడు మాధవ్.

ప్రతి రోజూ మాధవ్, మాధవి కలిసి చదువుకోసాగారు. క్రమంగా మాధవ్‌తో మరింత చనువు పెరిగింది. మాధవికి ఇంగ్లీషు భాషలో అతని ప్రావీణ్యత చూసి, అతని జనరల్ అవేర్‌నెస్ చూసి ఆమె ఆశ్చర్యపోయేది. ఇతనికి తెలియని సబ్జెక్టు గాని, విషయం గాని, లేనట్లుంది. కలిసి చదువుకోవడం వలన అతని కంటే తనకే ఎక్కువ లాభం కలుగుతుంది అనుకునేది.

మాధవ్ స్నేహానికి విలువను ఇవ్వడం, తనకేది కావాలన్నా గుర్తుంచుకుని మరీ తెచ్చివ్వడం ప్రతి పనీ క్రమం పద్ధతిలో చెయ్యడం ఆమెకెంతో నచ్చేవి. చదవడంలో శ్రమ తెలియకుండా మధ్య మధ్యలో అతను చెప్పే జోక్స్, కొటేషన్సు కూడా ఆమెకెంతో నచ్చేవి.

''మాధవ్ క్రమశిక్షణ కలవాడు. అంతే కాదు మంచి సెన్సాఫ్ హ్యూమర్ వున్న వ్యక్తి కూడా'' అనుకునేది మాధవి.

***

ఇంటర్వ్యూ గది నుంచి బయటికొచ్చిన మాధవికి మాధవ్ ఎదురొచ్చి ''ఎలా చేశారు?'' అని అడిగాడు.

''బాగా చేశాను. మాధవ్‌గారూ. మీకో సర్‌ప్రైజింగ్ న్యూస్''

ఏమిటన్నట్లుగా చూశాడు.

''ఇంటర్వ్యూ బోర్డులో ఇదివరకు మన బ్రాంచిలో ఆఫీసరుగా పనిచేసిన శ్రీనివాసరావు గారున్నారు.''

''అలాగా, వెరీగుడ్'' అన్నాడు మాధవ్ సంతోషంగా.

''నేను మీ ఇంటర్వ్యూ అయ్యేంతవరకూ వుంటాను. బాగా చేయండి'' అంది.

అలాగే థ్యాంక్స్

ఇంటర్వ్యూ అయ్యాక మాధవిని కలిశాడు మాధవ్. తాను ఇంటర్వ్యూ బాగా చేశానని, సాయంత్రం వరకూ వుండి శ్రీనివాసరావుతో మాట్లాడి వస్తానని మాధవితో చెప్పాడు. మాధవి వెళ్లిపోయింది.

***

ఇంటర్వ్యూ తర్వాత కూడా మాధవ్, మాధవిల స్నేహం కొనసాగింది. తన ఆలోచనల్లో ఎక్కువ శాతం మాధవ్ ఆక్రమిస్తున్నాడని ఆమెకు అర్థమైంది. అతను తన మంచితనంతో క్రమశిక్షణతో, ప్రతిభాపాటవాలతో తననెంతగా ప్రభావితం చేశాడో కూడా అర్థమైంది. అతను ఒక రోజు ఆఫీసుకు రాకపోయినా ఆమెకెంతో నిరుత్సాహం కలిగేది. క్రమంగా తను అతన్ని ప్రేమిస్తున్నానన్న విషయం కూడా ఆమె తెలుసుకుంది.


ఇంతలో ఓ రోజు ఇంటర్వ్యూ ఫలితాలు తెలిశాయి. మాధవ్ సెలక్ట్ కాలేదు. మాధవి సెలక్ట్ అయింది. మాధవికి తను సెలక్ట్ అయినందుకు ఎంతో సంతోషపడినా, మాధవ్ సెలక్ట్ కానందుకు అంతే బాధపడింది.

''మాధవ్‌గారూ... ఎందుకిలా జరిగింది? అంది అతనితో బాధగా...

''లిస్టులో నా పేరుకు పొరపాటుగా 'వి' చేర్చారేమో'' అన్నాడు సీరియస్‌గా.

అంత బాధలోనూ అతని జోక్‌కి ఆమెకు నవ్వు వచ్చింది. ప్రమోషన్ రానందుకు అతను అంతగా బాధపడకపోవడం ఆమెకు రిలీఫ్‌నిచ్చింది.

మాధవికి చెన్నైకి పోస్టింగ్స్ ఇచ్చారు. ఆమె రిలీవ్ అయి వెళ్లిపోయాక మాధవ్‌కు లోకమే శూన్యంగా అనిపించసాగింది. ఆమెను తను ప్రేమిస్తున్నానని అతనికీ అర్థమైంది. అతను ప్రతిరోజూ ఆమె సెల్‌కు ఫోన్ చేసి మాట్లాడసాగాడు. కొద్ది రోజుల తర్వాత మాధవి తనతో ఇదివరకంత ఆసక్తిగా అభిమానంగా మాట్లాడకపోవడం, ప్రతిసారీ తను ఫోన్ చేయడమే తప్ప ఆమె ఒక్కసారి కూడా అతనికి ఫోన్ చెయ్యకపోవడం గమనించాడు మాధవ్. తనూ ఆమెకు ఫోన్ చెయ్యడం మానుకున్నాడు. అయితే ఆమె ప్రవర్తన అతన్నెంతో బాధించింది. తనకెంతో ఆత్మీయురాలు అనుకున్న వ్యక్తి అలా తనను నిర్లక్ష్యం చెయ్యడం భరించలేకపోయాడు. అతనిలో



ఉత్సాహం సన్నగిల్లింది. మనిషి డీలా పడిపోయాడు.

***

''హాయ్... మాధవీ ఎప్పుడొచ్చావు నువ్వు చెన్నై నుంచి?'' అంటూ తన ఇంట్లోకి అడుగుపెట్టిన కొలీగ్ భార్గవిని చూసి ముందు ఇబ్బందిగా ముఖం పెట్టినా తర్వాత నవ్వుతూ ఆహ్వానించింది మాధవి.

''ఏమిటే ఈ మధ్య చిత్తూరుకి రావడమే లేదు.'' నిష్టూరంగా అంది భార్గవి.

''ఏం చెయ్యనే తల్లీ? ఎంత చేసినా తీరని పనులు. ఆఫీసరు ఎందుకయ్యానా అని బాధగా వుంది.

''అది సరే గాని నీకు పెళ్లి చూపులటగా. పై వాటాలో మా పిన్ని వుంది. ఆవిడ చెప్పింది. నువ్వు ఊర్లో ఉన్నావన్న విషయం కూడా ఆవిడే చెప్పింది. ఆఫీసుకు ఫోన్ చెయ్యొచ్చుగా.''

''నేను మధ్యాహ్నమే వచ్చాను. ఇంకో అర గంటలో నన్ను చూడ్డానికి పెళ్లివాళ్లు వస్తున్నారు. నాకు ఫోన్లు చెయ్యడానికి టైమెక్కడ చెప్పు? పైగా పెళ్లి కుదిరేదాకా ఈ విషయం మన స్టాఫ్‌కి తెలియడం నా కిష్టం లేదు. నువ్వు ఎవరికీ చెప్పకు.''

''సరే... కనీసం మాధవ్‌కైనా చెప్పావా?''

మాధవ్ పేరు వినగానే ఆమె ముఖంలో ఇబ్బంది, తప్పు చేసిన ఫీలింగ్ కనిపించాయి భార్గవికి.

''లేదు చెప్పాగా స్టాఫ్ ఎవ్వరికీ చెప్పలేదని''

''కాని మాధవ్ నీకు మంచి స్నేహితుడు కూడా''

''కావచ్చు... కాని నన్ను చూడాలని అతను ఈ సమయంలో వచ్చాడంటే నాకు ఇబ్బందిగా వుంటుంది. అతనితో ఫ్రీగా మాట్లాడనూ లేను. వెళ్లిపొమ్మనీ చెప్పలేను'' అంటూ ద్వారం వైపు చూసి నిశ్చేష్టురాలైంది.

అక్కడ మాధవ్ నిలబడి వున్నాడు.


ఆమె లేచి నిలబడింది. మాధవ్ గిరుక్కున తిరిగి వెళ్లిపోయాడు.

''ఖర్మ అతను ఈ టైముకే రావాలా? నా మాటలు వినాలా? నుదురు కొట్టుకుంది మాధవి విసుగ్గా.

''అతను రావడం మంచిదే అయింది. నీలోని మరో మనిషిని చూడగలిగాడు ఇప్పటికైనా'' అంది భార్గవి.

''ఏమిటి? నువ్వు మాట్లాడుతున్నది?'' కోపంగా ప్రశ్నించింది మాధవి.

''అవును, నీవు మాధవ్‌తో ఎంత స్నేహంగా వుండేదానివి? మాధవ్ ఎన్నివిధాలుగా నీకు సహాయం చేశాడో నీకు గుర్తుందా? తను సీనియర్ అన్న ఫీలింగ్ కానీ, మగవాడినన్న అహంగాని లేకుండా అనుక్షణం నీ సుఖం కోసం, సంతోషం కోసం తపించాడు. నీవు అతన్ని ప్రేమిస్తున్నావని ఎవరితో చెప్పుకోలేదు. కాని దాదాపు ఆ స్థితి వరకూ వెళ్లావని మాకందరికీ తెలుసు. ఇంతలో నీకు ప్రమోషన్ రావడంతో చెన్నై వెళ్లిపోయావు. కొత్త ప్రదేశం, కొత్త మనుషుల ప్రభావంతో మాధవ్‌ను, అతను చేసిన సహాయాలను మర్చిపోయావు. మీ ఇంట్లో నీకు పెళ్లి సంబంధాలు చూస్తుంటే నీవు మాధవ్ విషయం వాళ్లతో చెప్పలేదు. ఎందుకంటే మాధవ్



## రోజూ ద్రాక్ష ఆరోగ్యానికి రక్ష

ద్రాక్ష గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రోజూ ద్రాక్ష రసం ఒక గ్లాసు తాగడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు అంటున్నారు జార్జిటౌన్ విశ్వవిద్యాలయం పరిశోధకులు. కార్డియో వాస్క్యులర్ క్రియల్ని క్రమబద్ధం చేసి గుండెకి రక్తప్రసరణని పెంచే శక్తి ద్రాక్ష రసానికి ఉందని వారంటున్నారు. ద్రాక్షలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ హృదయాన్ని పదిలంగా ఉంచుతుందని తేలింది. రక్తం గడ్డకట్టడానికి యాంటీ ఆక్సిడెంట్లు రక్త ప్రసరణలో వచ్చే ఒడిదుడుకులని రూపుమాపుతుందని వారు జరిపిన పరిశోధనలో తెలిసింది. ఫాస్ట్‌ఫుడ్‌లకి అలవాటుపడిన పిల్లలని ఆ అలవాటునుంచి త్వరగా మాన్పించి వారిచేత రోజూ ఫ్రూట్స్ తినిపించాలని వారు సలహా ఇస్తున్నారు. చిన్నతనం నుంచి వారికి ఈ అలవాటు కలిగిస్తే భవిష్యత్తులో వారు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఆరోగ్యంగా పెరుగుతారని పరిశోధకులు వెల్లడిస్తున్నారు. కాబట్టి రోజూ ద్రాక్షని ఆహారంలో భాగంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది.

క్లర్కు. నీవు ఆఫీసరువి. అందుకే నీ కంటే పై స్థాయిలో వున్న వ్యక్తి నీ భర్త కావాలనుకున్నావు. ఈరోజు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు నిన్ను చూడడానికి వస్తున్నాడు. ఆ సంతోషంలో మాధవ్‌తో మాట్లాడడానికి కూడా ఇష్టపడడం లేదు నువ్వు.

కాని. ఒక్కటి గుర్తుంచుకో నీకు సాఫ్ట్‌వేర్ ఇంజనీరు భర్తగా వచ్చినా, జిల్లా కలెక్టర్ భర్తగా దొరికినా మాధవ్ లాంటి వ్యక్తిని భర్తగా పొందడం ఎంతో అదృష్టం. నీవు ప్రేమించే వ్యక్తికన్నా నిన్ను ప్రేమించే వ్యక్తితోనే నువ్వు సుఖంగా వుండగలవు. అని మన పెద్దలన్నారు. మాధవ్‌ను దూరం చేసుకొని నువ్వు పోగొట్టుకున్నదేమిటో త్వరలో నువ్వే తెలుసుకుంటావు. వస్తాను?''

విసవిసా వెళ్లిపోతున్న భార్గవినే చూస్తూండిపోయింది మాధవి. కట్నం విషయంలో ఏకాభిప్రాయం కుదరక మాధవికి ఆ సంబంధం తప్పిపోయింది.

***

సంవత్సరం తర్వాత ఓ రోజు శ్రీనివాసరావు చెన్నైలోని ఆఫీసుకు వచ్చినప్పుడు మాధవిని చూసి ''ఎలా వున్నావమ్మా?'' అంటూ పలకరించాడు.

''బాగున్నాను సార్... ఇంటర్వ్యూలో నన్ను సెలక్ట్ చేసినందుకు మీకు చాలా థాంక్స్''

''యూ డిజర్వ్ ఇట్ అండ్ యూ గాట్ ఇట్. మాధవ్ ఎలా వున్నాడు?''

''తెలియదు సార్. నేనాయన్ని చూసి సంవత్సరం కావస్తుంది.''

''అదేమిటి? నువ్వు చిత్తూరుకు పోవడం లేదా? ఫోన్లో కూడా మాట్లాడుకోవడం లేదా?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''లేదు. ఆయన మొదట్లో చేసేవారు. తర్వాత మానుకున్నారు. నేనూ చేయాలనుకుంటూనే వున్నాను. పనుల ఒత్తిడి వల్ల వీలుకావడం లేదు.''

''తప్పమ్మా ఇంగ్లీషులో ఓ సేయింగ్ వుంది. 'నెవర్ క్లోజ్ యువర్ లిప్స్ టు హూమ్ యు హావ్ ఓపెన్డ్ యువర్ హార్ట్' అని. నీవు అతన్ని అలా నిర్లక్ష్యం చేసి ఉండకూడదు.''

''అది నిర్లక్ష్యం కాదు సార్. మీకు తెలుసు ఆఫీసరైతే మనకు ఎన్నో పనులుంటాయి. నేను మా అమ్మకు ఫోన్ చేసి వారం రోజులవుతోంది.''

''బిజీ అన్నది మనం సృష్టించుకున్న ఓ సాకు మాత్రమే. వేర్ దేరీజ్ ఎ విల్... దేరీజ్ ఎ వే... నీ ప్రవర్తనకు మాధవ్ ఎంతో బాధపడుతున్నాడు''

''ఆ విషయం మీకెలా తెలుసు?''

''నేను రెండు నెలల క్రితం చిత్తూరు వెళ్లాను. ఆఫీసులో మాధవ్‌ని కలిశాను. మనిషి చాలా తగ్గిపోయాడు. ఎంత అడిగినా కారణం చెప్పలేదు. తర్వాత భార్గవి జరిగిన విషయం చెప్పింది''

మాధవికి మాధవ్ పైనా, భార్గవి పైనా విపరీతంగా కోపం వచ్చింది.

''మాధవ్ ఈజ్ టూ సెంటిమెంటల్ సార్. జీవితం ఓ రైలు ప్రయాణంలాంటిది. ఎందరో ఎక్కుతుంటారు. దిగుతుంటారు. జీవితాంతం అందరూ మనతో ఉండిపోరు కదా. ఆ విషయం అర్థం చేసుకోవాలి అతను'' అంది విసుగ్గా.

''నిజం చెప్పావు. కాని ట్రైనులో నీతో కొంతసేపు ప్రయాణించిన వ్యక్తి కోరుకుంటే నీ ఉద్యోగాన్ని గాని, డబ్బును గాని త్యాగం చేస్తావా?''

''నేనెందుకు చేస్తాను''

''మాధవ్ చేశాడు. నీ కోసం. తన ప్రమోషన్ త్యాగం చేశాడు''

నమ్మలేనట్లు చూసింది మాధవి.

''అవునమ్మా మీకు ఇంటర్వ్యూ అయిన రోజు సాయంత్రం మాధవ్ నన్ను కలిశాడు. అప్పటికే మేము ఇంటర్వ్యూ బాగాచేసిన కొందరి పేర్లను రాసి వుంచాము. ఉదయం వారి లోంచి కొందర్ని

ఫైనల్‌గా సెలక్ట్ చేయాలి. ఆ లిస్టులో మీ ఇద్దరి పేర్లు వున్నాయి. ఆ విషయం మాధవ్‌తో చెప్పి పోస్టులు చాలా తక్కువ కావడంతో అవకాశాలు చాలా తక్కువగా వున్నాయని, అయితే ఇంటర్వ్యూ బోర్డు మెంబర్‌గా ఒకర్ని ఎన్నుకునే అవకాశం నాకుందని, మాధవ్‌ను అలా ఎన్నుకుంటానని అన్నాను. అతను అందుకు అంగీకరించలేదు. మాధవి తను సెలక్ట్ అవుతానని ఎంతో ఆశగా వుంది. సెలక్ట్ కాకుంటే ఎంతో బాధపడుతుంది. ఆమె బాధపడితే నేను సంతోషంగా వుండలేను. అందువల్ల ఆవిడనే సెలక్ట్ చేయండి'' అన్నాడు అతను కోరినట్లే నిన్ను సెలక్ట్ చేశాను.

మాధవి ఆశ్చర్యపోయింది. మాధవ్ ఆ విషయం తనతో ఎప్పుడూ అనకపోవడం ఆమెను మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. అతనంటే గౌరవం పెరిగింది. అటువంటి వ్యక్తిని ఇన్నాళ్లు నిర్లక్ష్యం చేసినందుకు మనసులోనే సిగ్గుపడింది.

''నీ మనసుకు దగ్గరగా వచ్చిన వ్యక్తిని అతని తప్పు లేకుండా దూరంగా వుంచడం న్యాయం కాదమ్మా ఆలోచించమ్మా''

''ఐయామ్ సారీ సార్. నేను రేపు చిత్తూరు వెళుతున్నాను. మాధవ్‌ను కలిసి మాట్లాడతాను.'' అంది బాధగా ముఖం పెట్టి.

మరునాడు బస్సులో కూర్చున్న మాధవికి పదే పదే మాధవ్ గుర్తుకురాసాగాడు. అతని కల్మషం లేని నవ్వు, హుందాతనం, పనిపట్ల అంకిత భావం, సహోద్యోగుల పట్ల కన్సర్న్ అన్నీ గుర్తుకు రాసాగాయి. అతను తన పట్ల చూపిన అభిమానం, ఆదరణ గుర్తుకొచ్చి ఆమె కళ్లల్లో నీళ్లు నిండాయి.

చిత్తూరు చేరగానే ఇంటికెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాక మాధవ్ ఇంటికి బయలుదేరింది. మాధవ్ ఇంటి ముందు పందిరి, ఇంటి తలుపుకు తాళం ఆమెను ఆందోళన పరిచాయి. 'మాధవ్‌కు పెళ్లి కుదిరిందా?'' అనుకుంటూ తన కొలీగ్ రాగిణికి సెల్ నుంచి ఫోన్ చేసి అడిగింది.

''అవును మాధవ్‌కు రేపు ఉదయం పెళ్లి. నేను డిన్నర్‌కు బయలుదేరుతున్నాను. నువ్వు అక్కడే వుండు. నేను వచ్చి పికప్ చేసుకుంటాను'' అంది రాగిణి.

''నేను రాను, మాధవ్ నన్ను పిలవలేదు'' కళ్ల నీళ్లతో అంది మాధవి.

''నీకు ఇన్విటేషన్ కార్డు రాయడం నేను చూశాను. బహుశా పోస్టల్‌లో మిస్ అయి వుంటుంది మనం వెళదాం రా''

''అలాగే'' అంది. అయితే ఓ మంచి వ్యక్తిని భర్తగా పొందే అవకాశాన్ని తన చేతులారా దూరం చేసుకున్నందుకు ఎంతో బాధపడింది.

కళ్యాణ మండపం వెలుపల 'మాధవ్ వెడ్స్ ఉమ' అన్న విద్యుద్దీపాలతో పేర్చి వున్న అక్షరాలను చూసి ఆమెకు ఏడుపొచ్చింది.

మాధవ్ అందర్ని నవ్వుతూ రిసీవ్ చేసుకుంటున్నాడు. మాధవిని చూసి మొదట ఆశ్చర్యపోయాడు. తర్వాత సంతోషంగా ఆమెని ఆహ్వానించాడు.

''బాగున్నారా? మీరు అంత దూరం నుంచి పెళ్లికి రావడం నాకెంతో ఆనందంగా వుంది'' అన్నాడు.

ఆమెకు ఏం మాట్లాడాలో తోచలేదు. బలవంతంగా ఓ నవ్వు నవ్వి లోపలకి వెళ్లింది. లాన్‌లో కుర్చీలు వేసి వుండడంతో ఎవరికీ కనపడకుండా ఓ కుర్చీలో కూర్చుని నీరసంగా తల వెనక్కి వాల్చింది. అలా ఎంతసేపు కూర్చుందో ఆమెకే తెలియదు. 'మాధవి గారూ భోజనానికి లేవండి' అన్న మాటలు విని తలెత్తి చూసింది.

ఎదురుగా మాధవ్ నిలబడి వున్నాడు. అతని ముఖంలో అదే ఆప్యాయత. కళ్లల్లో అదే అభిమానం.

ఆమె లేచి నిలబడింది. 'మీరు భోంచేశారా?' అని అడిగింది.

లేదన్నట్లు తల అడ్డంగా ఊపాడు.

''ఓ... మీరు పెళ్లికొడుకు కాబట్టి...పెళ్లికూతురితోనే భోంచేయాలి కదూ...''

''పెళ్లికొడుకు నేను కానండి. పెళ్లి కూతురి అన్నను నేను. అయితే తమాషాగా పెళ్లికొడుకు పేరు కూడా నా పేరే''.

ఆశ్చర్యంగా అతనివైపు చూసింది. అతను నవ్వుతున్నాడు. అప్పుడు గుర్తుకొచ్చింది ఆమెకు. మాధవ్ చెల్లెలి పేరు 'ఉమ' అని. రాగిణి తనను ఏడిపించడానికే మాధవ్‌కు పెళ్లని అబద్ధం చెప్పిందని అర్థమైంది ఆమెకు.

తన అనుమానాలు తొలగడంతో పాటు తన లోని అహంభావం కూడా మంచులా కరిగిపోవడంతో అతనివైపు చూసి నవ్వింది.

ఆ నవ్వులో తన పట్ల అభిమానం, ప్రేమ కనిపించాయి మాధవ్‌కు.

★

